క్లుప్తంగా

మహిళా శక్తి ఏంటో చూపాలి



వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో మహి ళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్కాపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవిలను గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఈ సందర్భంగా సత్కరించారు. అతిథిగా పాల్గొన్న భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి అంతా సంఘటితమై ఉద్యమాలు సాగించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి రోజున గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించడం అత్యంత స్ఫూర్తిదాయకం అన్నారు.ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత కరుకు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: పట్టణ పరిధిలో అర్హులైన నిరుపేదలకు రెండు సెంట్ల భూమిలో ఇంటిని నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ కోరారు.ఈ మేరకు మంగళవారం 61వ వార్డులోని మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద గల సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలకు కనీసం రెండు సెంట్ల భూమిలో ఇంటిని నిర్మించి ఇస్తామన్నారని, నేడు ఆ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీని కూటమి పాలకులు నెరవేర్చాలని.. లేకుంటే దీనిపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సింథియా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న బహిరంగ సభ నిర్వహించనున్నట్టు సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ చెప్పారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ కూడలిలోని ఆ పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు.

ఆ రోజు డీఎంఆర్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణను విరమించుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులు కట్టబెడితే చూస్తూ ఊరుకోమన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆటో, భవన నిర్మాణ కార్మికులకు, వీధి విక్రయదారులకు, రవాణా రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గుడాల రాంబాబు, ఎస్వీ త్రినాథ్, కామేశ్వరరావు, కనకేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో.. ఆపద్బాంధవులు

- 108 సిబ్బంది సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఈ నెల 25 నుంచి సమ్మెలోకి..
- ఆందోళన చెందుతున్న ప్రజానీకం
- ఎన్ఏడీ కేంద్రంగా నెలకు సుమారు 250 పైగా కేసుల తరలింపు



రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని తరలిస్తున్న 108 సిబ్బంది (ఫైల్)



విశాఖ విద్య: ఆపద్బాంధవులుగా పేరొందిన 108 సిబ్బంది ఆపదలో పడ్డారు. అరకొర వేతనాలతో కంటిమీద కునుకు లేకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కరువైంది. ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న వారు కూటమి ప్రభుత్వం తీరుతో కలవరం చెందుతున్నారు. 108 సర్వీసుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం వేస్తున్న అడుగులు వారిలో ఆందోళనకు కారణమైంది. విధిలేని స్థితిలో ఉద్యోగ భద్రత కోసం పోరుబాటకు సిద్ధమయ్యారు.



గోపాలపట్నం తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సిబ్బంది

నిరసన తెలిపినా స్పందించని సర్కారు

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 108 సిబ్బంది ఒక రోజు నిరశన చేపట్టారు. వినతుల ద్వారా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్పందించక పోవడంతో ఈ నెల 25 నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్తొన్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ముందస్తు నోటీసు సైతం ఉన్నతాధికారులకు అందజేశారు.

జిల్లాలో ఎన్ఏడీ వెహికల్ సేవలు భేష్

జిల్లాలో 108 వాహనాలు 15 ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ నెలా జిల్లా మొత్తం మీద 2500 నుంచి 3 వేల వరకు అత్యవసర కేసులను వైద్యం నిమిత్తం ఆస్పత్రులకు తరలిస్తారు. కాగా ఎన్ఏడీ కేంద్రంగా ఉన్న వాహనం ద్వారా ప్రతీ నెలా 250కు పైగా కేసులను తరలిస్తున్నారు. జిల్లాలో అత్యధిక కేసులు తరలించేది ఎన్ఏడీలో వాహనమేనని సంబంధిత అధికారులు వెల్లడించారు.

సమ్మెలోకి వెళ్తే ఇబ్బందులే

అటు గోపాలపట్నం, ఇటు కంచరపాలెం, మరో వైపున గాజువాక, ఇటువైపు ఆర్టీసీ బస్టాండ్ వరకు ఏదైనా అత్యవసర సమయంలో ఇక్కడ ఉండే వాహనాన్ని పంపిస్తున్నారు. గోపాలపట్నం నుంచి కంచరపాలెం వరకు గల రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా బిర్లా జంక్షన్ నుంచి గాజువాక వరకూ గల హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయాల్లో ఎన్ఏడీ కేంద్రంగా ఉన్న 108 అంబులెన్స్ సకాలంలో చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన సందర్భాలు ఉన్నాయి. 108 సిబ్బంది సమ్మెలోకి వెళ్తే అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండదని ఈ ప్రాంత ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

జిల్లాలో 108 సర్వీసుల్లో 75 మంది పని చేస్తున్నారు. వీరంతా రెండు షిఫ్టుల్లో రోజువారీ విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బంది సీనియార్టీని ఆధారంగా మూడు శ్లాబ్‌లుగా విభజించి వేతనాలు చెల్లిస్తున్నారు. పైలట్(డ్రైవర్)కు రూ. 18 వేలు, రూ. 23 వేలు,రూ. 28 వేలు చొప్పున చెల్లిస్తుండగా, ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ)లకురూ. 20 వేలు, రూ.25వేలు, రూ.30 వేల చొప్పున జీతాలు ఇస్తున్నారు. అయితే జిల్లాలో ఇంకా 7గురు ఈఎంటీల కొరత ఉంది.



108లో ప్రసవించిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

డిమాండ్లు ఇవీ

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. గతంలో చెల్లించిన రీతిలో ప్రతీ నెలా రూ.4 వేల ఇన్సెంటివ్ ఇవ్వాలని, వైద్య ఆరోగ్యశాఖలో భాగంగా పని చేస్తున్న తమను మిగతా వారి మాదిరి విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. వేతనాల ఆలస్యం కాకుండా ప్రతీ నెలా ఒకటో తారీఖునే ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు షిఫ్టులు కాకుండా, మూడు షిఫ్టులను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మావి న్యాయమైన కోర్కెలే..



అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్న తాము విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. ఎంతో మందిప్రాణాలు కాపాడుతున్నామనే సంతోషంలో కష్టాన్ని మరిచిపోతున్నాం. మా కుటుంబాల జీవనం సాఫీగా సాగాలంటే పనికి తగ్గ జీతం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. జిల్లాలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉంది. మా ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాలనే ఉద్దేశంతో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మెకు సిద్ధమవుతున్నాం.

–ఎస్. బంగార్రాజు,
108 ఎంప్లాయిస్ యూనియన్, జిల్లా అధ్యక్షుడు

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కాపురం: దేశ ప్రజల కోసం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయం అని కాంగ్రెస్ నాయకురాలు రజియాభేగం అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు యర్రయ్య,రమణ,శ్రీనివాసరావు,సబ్బరపు శ్రీను పాల్గొన్నారు.

ఉక్కు మహిళకు ఆత్మీయ నివాళి



ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్వీ నరసింహం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి ప్రముఖ రచయిత్రి దామరాజు విశాలాక్షి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మిద్ది అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరా గాంధీ సేవలు అమూల్యమన్నారు. ఉక్కు మహిళా పేరు గాంచారన్నారు.అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు .

వేడుకగా లక్షపత్రి పూజ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవం సందర్భంగా మంగళవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామికి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్షపత్రి పూజ వైభోపేతంగా జరిపించారు. పది మంది పురోహితులు పాల్గొని భక్తులతో సామూహిక పూజలు చేయించారు. వేదమంత్రాల నడుమసాగిన పూజతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. ఇదే సమయంలో పూజారులంతా వేదమంత్రాల నడుమ హోమం నిర్వహించారు. ఈ వేడుకలో 400 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు రవిశంకర్, సూర్యనారాయణ, భరత్ కుమార్, కేఎస్ఎన్ రాజు, హరీష్ కుమార్ పాల్గొన్నారు.



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో పూజలందుకున్న గణనాథుడు



లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు

జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక ఆలయంలో శంకటహర చతుర్థి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణనాథుడుకి అభిషేకం జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకోగా,వారి గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిరాశ్రయుడికి వైద్య సేవలు



ఆస్పత్రిలో చేర్పించిన మమత

విశాఖ విద్య: జగదాంబ సెంటర్‌లోని బస్ షెల్టర్ వద్ద నిస్సహాయ స్థితిలో ఉన్న వ్యక్తిని మమత చారిటబుల్ ట్రస్ట్ ఎల్లేటి మమత ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. మహారాణి పేట సీఐ సహకారంతో ఆ వ్యక్తిని ట్రస్ట్ వాహనంలో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు.

ఘనంగా వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలు

సింథియా: నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం –1లో మంగళవారం పాఠశాల వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగి నేతృత్వంలో నిర్వహించిన వేడుకలకు ఐఎన్ఎస్ సర్కార్‌కు చెందిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కమాండర్ హ్యాపీ మోహన్, మయూరి మోహన్, నామినీ వైస్ చైర్మన్ కమాండర్ సురుచి గౌర్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగడానికి, శారీరకంగా, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు.

వార్షిక స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సుధీర్‌కుమార్ మైంగీ

నత్తేనయం!



ఇండోర్ స్టేడియం ముందు భాగం

- సాగుతున్న ఇండోర్ స్టేడియం పనులు
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్రీడాకారులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత క్రీడాకారులను ఇండోర్ స్టేడియం ఊరిస్తోంది. వారు ఎంత ఆశగా ఎదురు చూస్తున్నారో పనులు అంత ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో ఎప్పటికి స్టేడియం నిర్మాణం పూర్తవుతుందోనని క్రీడాకారులు నిరీక్షిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వుడా కాలనీ మధ్యలో విశాలమైన స్థలంలో క్రికెట్,బాస్కెట్‌బాల్,షటిల్ వంటి క్రీడలు ఆడేవారు.ఆ ప్రాంతంలో మైదానం నిర్మించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ఆరేళ్ల కిందట 7,200 గజాల స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.90 కోట్లతో వ్యయంతో స్టేడియం నిర్మాణానికి సిద్ధమయ్యారు.అయితే భూమి పూజ చేసినా పనులు మందకొడిగా సాగాయి. ఈ లోగో 2019లో వైఎస్సార్‌సీపీ అధికారం వచ్చిన తర్వాత స్టేడియం నిర్మాణంపై పాలకులు దృష్టి పెట్టారు. ఇంతలో కోవిడ్ రావడంతో రెండు సంవత్సరాలు దీని పనులు నిలిచాయి. 2023లో మరలా పనులు వేగవంతం అయ్యాయి. ఆ ఏడాదే దాదాపు 70 శాతం పూర్తి అయ్యాయి.మరలా కూటమి అధికారంలోకి రావడంతో పనులు వేగం తగ్గాయి. దీంతో క్రీడాకారులు దేవుడా ఎప్పటికి పనులు పూర్తి అవుతాయో,ఎప్పుడు ఆ స్టేడియంలో ఆడుకుంటామో అని నిట్టూరుస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియం పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



రేకులు వేసేందుకు వేసిన ఇనుప యాంగిలర్స్

తీర్థయాత్ర బస్సులో వివాదం



ట్రాఫిక్ పోలీసుకు సమస్య వివరిస్తున్న ప్రయాణికులు

మల్కాపురం: ప్రయాణికులు, ఓ టూర్ బస్సు డ్రైవర్ మధ్య సమన్వయం లోపించడంతో వివాదానికి దారితీసింది. చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అంతా సుఖాంతమైంది. ఈ ఘటనకు సంబంధించి ప్రయాణికులు తెలిపిన వివరాలు..

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన మహలక్ష్మి అనే మహిళ బస్సుల ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన వారిని తీర్థయాత్రలకు తీసుకువెళ్తుంది. కార్తీక మాసం కావడంతో నగరానికి చెందిన ఓ ట్రావెల్ బస్సులో ఏజెంట్ అయిన మహాలక్ష్మి పలు ప్రాంతాలకు చెందిన వారిని విజయవాడ,భీమవరం,అమరావతి,ద్రాక్షారామం తదితర ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లింది. అయితే అనకాపల్లి బుచ్చయ్యపేట మండలానికి చెందిన సుమారు 19 మంది ప్రయాణికులు కూడా ఇదే బస్సులో యాత్రకు వెళ్లారు. అయితే యాత్రకు వెళ్లిన రోజు వారిని బుచ్చెయ్యపేట వెళ్లి పికప్ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం శ్రీహరిపురం లేదా గాజువాకలో పికప్ చేసుకుని తిరుగుప్రయాణంలో ఆ రెండు ప్రాంతాల్లో ఏదో ఒకచోట విడిచి పెట్టాలి. దాని ప్రకారం తిరుగు ప్రయాణంలో డ్రైవర్ వారిని శ్రీహరిపురం తీసుకువచ్చాడు.




గాయపడిన మహిళ

అయితే బుచ్చెయ్యపేట ప్రాంతానికి చెందిన యాత్రికులు తమను బుచ్చెయ్యపేటలోనే దించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్ ఉందని.. మొదటి రోజు ఏజెంట్ రిక్వెస్ట్ చేయడంతో వచ్చానని.. ఇప్పుడు కుదరదని డ్రైవర్ స్పష్టం చేశాడు. దీంతో బస్సులో వారు కేకలు వేశారు. డ్రైవర్ వేగం పెంచి గాజువాక వైపు వచ్చాడు. దీంతో బస్సులో ఉన్న వారు 100 కు డయల్ చేయడంతో గాజువాక ట్రాఫిక్ పోలీసులు బస్సును వెంబడించి శ్రీహరిపురం చేరుకున్నారు. పోలీసులు అక్కడ జరిగిన గందరగోళంపై ప్రశ్నించారు. అనంతరం మల్కాపురం పోలీసులు డ్రైవర్‌తో పాటు బస్సును స్టేషన్‌కు తరలించి విచారించారు. దీంతో ఇరువర్గాల వారి వాదనలు విన్నారు.ప్రయాణికులను వారికి గమ్యస్థానానికి చేర్చాలని పోలీసులు సూచించడంతో డ్రైవర్ తిరిగి బుచ్చెయ్యపేట తీసుకువెళ్లాడు. దీంతో వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. కాగా బస్సు వేగంగా నడపడంతో స్పీడ్ బ్రేకర్ వద్ద బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన మహిళ నడుము భాగానికి గాయం అయ్యింది.ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మానవ హక్కుల రక్షణకు కృషి

దాబాగార్డెన్స్: ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆలిండియాకు మెయిన్ ఆర్గనైజర్‌గా నేషనల్ బోర్డు కమిటీ ఆఫ్ ఇండియా సిఫార్సుపై తనను నియమించినట్టు సన్నికృష్ణ రాజయ్య బయగాని (ఆల్ఫా కృష్ణ) తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ నేషనల్ బోర్డు కమిటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ కామేష్ గాడి తనను జాతీయ స్థాయిలో మెయిన్ ఆర్గనైజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ పదవి మూడేళ్లపాటు ఉంటుందన్నారు. ప్రజలకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు మానవ హక్కులను పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. సామాజిక కార్యకలాపాలు కొనసాగిస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన



వినియోగదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మల్కాపురం ఉప విద్యుత్ కార్యాలయం (సబ్‌స్టేషన్) వద్ద సీజీఆర్ఎఫ్ నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థ సేవల్లో లోపాల సత్వర పరిష్కారం కోసం ఈ వేదిక ఏర్పాటు చేశారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సభ్యుడు షేక్‌బాబర్ మల్కాపురం,శ్రీహరిపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని అక్కడే పరిష్కరించే విధంగా వేదిక వద్ద అధికారులకు సూచించారు. ఈ ఏడాది 276 సదస్సులు నిర్వహించామన్నారు. ఆయా కార్యక్రమాల ద్వారా 8,241 సమస్యలు తమ దృష్టికి రాగా 8,109 సమస్యలను సత్వరమే పరిష్కరించగలిగామని వివరించారు.ఇంకా 132 సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమం అనంతరం కళాశాల విద్యార్థులకు విద్యుత్ భద్రత మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వినియోగదారులు

కేజీహెచ్ ఏవోకు అభినందనలు

దాబాగార్డెన్స్ : కేజీహెచ్ పరిపాలన అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీఎస్ అప్పారావును ఆస్పత్రి ఎస్సీ, ఎస్టీ యూనియన్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాస్ నేతృత్వంలో పలువురు ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్ఓ, ఎంఎన్‌వోలకు యూనిఫాం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ఉపాధ్యక్షుడు వెంకటరావు, పార్వతి పాల్గొన్నారు.